ఆఫీసులకి చేరలేక, సైకిళ్లకి, స్కూటర్లకి అపాయాలు కొని తెచ్చుకొని, ఒక్కొక్క సందర్భంలో దెబ్బలు తిని ఎలాగో చేరగలగవచ్చు. కాని అలా కూడా ఆఫీసులకి చేరలేని వాళ్లు ముఖ్యంగా మహిళా ఉద్యోగులు - ఆ రోజు సెలవు గ్రాంటు కాక జీతాలు నష్ట పోతారు. వాళ్ల మీద అధికారులు శాఖాపరమైన చర్య తీసుకోవచ్చు. సర్వీస్ బ్రేక్ కావచ్చు. కాన్ఫిడెన్షల్‌లో చెడ్డ రిమార్కు పడవచ్చు.

బంద్ దినాల్లో రిక్షాలూ, ఆటోలూ, బస్సులూ, రైళ్లూ నడవక పోవడం వల్ల ప్రయాణాలు ఆగిపోయి అన్ని తరగతుల ప్రజలకు పనులు అవవు. ఆసుపత్రుల వరకు ప్రయాణం చేయలేని రోగులు మార్గమధ్యంలో ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు అనేకం.

సాధారణమైన దినాల్లో బాధ్యత గల పౌరులుగా వ్యవహరించే వారు కూడా బంద్ రోజుల్లో క్రూరంగా ప్రవర్తించి షాపులు లూటీ చెయ్యడం నుంచి సాటి మనిషిని హింసించే వరకు దిగజారిపోతున్నారు.

అధికారులు, రాజకీయ నాయకులు కార్లలో తిరిగి "బంద్ సక్సెస్" అవునా కాదా నిర్ణయించే మహత్తరమైన బాధ్యత చేపట్టినా, "బంద్ విజయవంతం" అంటే "ప్రజలు విఫలులైనారు" అనే అర్థాన్ని గ్రహించలేని మూఢులు అవుతున్నారు.

నాలుగు వందల యాభై పేజీలకి సాగిన ఆ పరిశోధనా గ్రంథంలో పేజీ పేజీ చదివి తప్పులు పట్టుకుని దిద్దడం పూర్తి చేసేసరికి రాత్రి ఒంటిగంటన్నర అయింది.

"చాలా బాగుందోయ్, నీ థీసిస్సు." అన్నాను.

"ఉదయం కొంచెం తొందరగా లేపండి. ఎనిమిది గంటల కల్లా ఈ థీసిస్ కాపీలు యూనివర్సిటీలో ఇచ్చెయ్యాలి. ఆగస్టు 30 లోగా ఈ థీసిస్ చేరకపోతే ఇది పరిశీలనకి అర్హత కోల్పోతుందని వార్నింగ్ ఇచ్చేరు" అన్నాడు శివనాథం.

"నీ థీసిస్ ఈ రోజు చేరదు, నీకు డాక్టరేటు రాదు. ఎందుకంటే ఇవాళబంద్!" అని నేను లేచిపోయాను. ★

# 24. దేవుడి దయ

మా నాన్నగారికి దేవుడంటే నమ్మకం లేదు.

"దేవుడు అనేది మనిషి మెదడులో పుట్టిన అందమైన భావాల్లో ఒకటి. మనుషులు తమ చేత కాని తనానికి నష్టాలు పొందినప్పుడూ, తమ అతిచాతుర్యం వల్ల సాటి మనుషుల్ని మోసంచేసి లాభాలు పొందినప్పుడూ సమానమైన విరక్తితో చెయ్యగల ఒకానొక వ్యాఖ్యానం "దేవుడి దయ" - అనేవారు ఆయన.

నాకుజ్ఞానం వచ్చేక ఓసారి ఆయన దేవుడి గురించి, దేవుడి దయ గురించి చేసే వ్యాఖ్యానాలు విని మా నాన్నగార్ని ఎదురు ప్రశ్న వేసాను. "మీరేమో దేవుడు లేడంటారు. మరి అమ్మ మాత్రం కేలండరులో ఉన్నవి, సాటివాళ్లు చెప్పినవి అన్ని రకాల నోములు, వ్రతాలు,

పూజలు చేస్తూ ఇంట్లో పూజ గదిలోనే కాక అన్ని గదుల్లోనూ తలా ఒక దేవుడి పటం వేళ్లాడగట్టి మన ఇంట్లో దేవ భావానికి ప్రాణం పోస్తోంది. దీనికేమంటారు?''

"మీ అమ్మ పూజలు చెయ్యడం, దేవుళ్ల పటాలు గోడలకి వేళ్లాడ గట్టడం ఆవిడ వ్యక్తి స్వాతంత్ర్యానికి సంబంధించిన విషయాలు, అందుకని నేను కలగజేసుకోడం తప్పు. నువ్వు విన్లేదూ, ఒక అమెరికన్ ప్రెసిడెంటు చెప్పిన మాట?''

"ఏమన్నాడండీ?''

"--నీ అభిప్రాయంతో నేను ఏకీభవించక పోవచ్చు. కాని ఆ అభిప్రాయం వ్యక్తపరచడానికి నీకున్న హక్కు కోసం నా చివరి రక్తపు బొట్టు వరకు పోట్లాడతాను - అని ఆ మాట.''

బస్సుల్లో, కార్లలో, స్కూటర్ల మీద, సైకిళ్ల మీద - వెళ్లేవాళ్లలో రోడ్డు పక్కని శివాలయమో, గణపతి గుడో, పైడి తల్లి అమ్మవారి గుడో సమీపించినప్పుడు కళ్లు మూసుకుని నమస్కారాలు పెట్టేవాళ్లని, వంగి దండాలు పెట్టి లెంపలేసుకునే వాళ్లని, ఒంటి చేత్తో గుడ్ మార్నింగులు కొట్టే వాళ్లని చూపించి వినోదించడం మా నాన్న గారికి ఒక కాలక్షేపమని నేను ఎరుగుదును. మా ఇంటి పక్కనే ఒక శివాలయం ఉంది; కనక, వీధి గుమ్మంలో నిలబడి ఉంటే ఈ రకం దృశ్యాలు ఉదయం నుంచి సాయంకాలం వరకు కనబడుతూనే ఉంటాయి.

మా ఇంటి పక్కని ఉన్న శివాలయం చాలా విశాలమైంది. దేవుడికి దండం పెట్టడానికే కాక ప్రశాంతంగా కూర్చోడానికి కూడా అక్కడికి వెళ్లవచ్చు. మా ఇంట్లో రెండో వాటాలో అద్దెకుంటున్న వాళ్లు రేడియో బిగ్గరగా పెట్టి నాకు చదువులో ఏకాగ్రత లేకుండా చేసినప్పుడల్లా నేను శివాలయంలోకి వెళ్లి చదువుకోడం నాకు బాగా గుర్తుంది. ఇంటి పక్కనే గుడి ఉన్నా మా నాన్న గారు మాత్రం నాకు తెలిసినంత వరకు ప్రణామానికి గాని ప్రసాదానికి గాని ఎన్నడూ గుడిలోకి వెళ్లలేదు. అయితే ఆయన ఒకసారి గుడిలోకి వెళ్తానని బయలుదేరడం నాకు మరపురాని సంఘటనల్లో ఒకటి.

నేను ఎలక్ట్రానిక్స్, బి.టెక్. చదివాను. కంప్యూటరైజేషన్ కోర్సు చేసేను. మా ఫైనలియర్ పరీక్షలు అవుతున్నప్పుడు అమెరికాలోని ఒక పెద్ద కంపెనీ తాలూకు ప్రతినిధి మా కేంపస్‌కి వచ్చి, నా వివరాలు రాసుకుని వెళ్లాడు. ఇంటికొచ్చే వేళకి నాకొక ఉత్తరం వచ్చి ఉంది. నేను ఫస్టు క్లాసులో పాసైతే అమెరికాలో ఎమ్.టెక్. చేసుకోడానికి, ఆ కంపెనీలో చిన్న ఉద్యోగం చేసుకోడానికి ఏర్పాట్లున్నాయనీ పాస్‌పోర్టు, వీసా అలాంటి వన్నీ సిద్ధం చేసుకోమని, తాము పంపిన ఫారాలు నింపి పంపమని ఆ ఉత్తరం. రిజల్టు ప్రకటించిన మర్నాటి కల్లా నాకు అమెరికాలో ఆ స్కాలర్‌షిప్పు, ఉద్యోగం ఖాయమైనట్లు రాస్తూ ఫలానా తేదీని ఢిల్లీ చేరమని సూచన చేసేరు. అదుగో, ఆ విధంగా నేను ఢిల్లీ చేరడానికి విశాఖపట్నంలో బయలుదేరవలసిన రోజున మా ఇంట్లో కుళాయిలోంచీ, వీధి కుళాయి లోంచీ నీళ్లు రాలేదు. శివాలయం లోంచి జనం బిందెలతో నీళ్లు పట్టుకుపోతూ ఉండడం చూసి మా నాన్న గారు శివాలయానికి బయలుదేరారు.

నా హడావిడి నాకున్నా, నాన్నగారు దేవాలయానికి వెళ్తున్నారు కదా అని కుతూహలం చేతనూ, సాయానికీ, నేను వెళ్లాను. శివాలయంలో ఉన్న రెండు కుళాయిల్లోంచి నీళ్లు పడడమే కాక అక్కడ నిర్మించిన ఓవర్ హెడ్ టాంకు లోంచి కూడా నీళ్లు పొంగిపొర్లుతున్నాయి.మా

నాన్నగారు పూజారి గారిని కలుసుకుని, ఓ నలభై నిమిషాలపాటు ప్లాస్టిక్ గొట్టాంతో నీళ్లు మా ఇంట్లోకి ఇమ్మని అడిగీ అడగ్గానే పూజారి గారు ఒప్పుకున్నారు. "తమరు ఈ పొరుగునే ఉన్నారని ఎరుగుదును, కాని ఎన్నడూ తమ దర్శనం అయిందికాదు.'' అన్నారు పూజారి గారు. మా నాన్నగారు నవ్వి; "ఎలా అవుతుంది? నాకేమో దేవుడంటే నమ్మకం లేదాయె. నీకేమో రాత్రింబవళ్లు దేవుణ్ణి, భక్తుల్ని నమ్ముకునే ఉద్యోగమాయె!'' అన్నారు. పూజారి గారు ఖంగు తిన్నారని వినోదించడమా లేక ఆయన నీళ్లు ఇస్తున్నప్పుడు ఈయన ఈ పుల్లవిరుపు మాట ఆడినందుకు నొచ్చుకోడమా తేల్చుకోలేక పోయాను. పూజారి గారు కూడా నవ్వేసి "స్వశక్తి మీద నమ్మకం ఉన్నంతకాలం దైవభక్తి కొందరికి ఏర్పడదని శివపురాణంలో సాక్షాత్తూ ఈశ్వరుడి నోటి వాక్యమే ఉంది బాబూ'' అన్నారు.

ఈ ఇరవై ఏళ్లూ అమెరికాలోనే ఉండిపోయాను. రెండు డిసిప్లిన్స్‌లో ఎం.టెక్.లు చేసి, ఒక డాక్టరేటు చేసి, స్వల్పకాలిక ఎం.బి.ఏ. కోర్సు ఒకటి పూర్తి చేసి; చదువుతో పాటే సంపాదన చేపట్టి గొప్ప ఇంజినీర్ని అయి, ఒక కంపెనీలో డైరెక్టర్ హోదాతో ఆకుపచ్చ కార్డుదారుడుగా అక్కడ స్థిర పడ్డంవల్ల మా నాన్నగారు దైవ భక్తుడు కాకుండా ఉండిపోయినట్టు నేను దేశభక్తుణ్ణి కాకుండా ఉండిపోయాను.

అటువంటి సమయంలో మా నాన్నగారు నన్ను భారతదేశానికి తిరిగి వచ్చెయ్యమని ఆందోళనాత్మకమైన సందేశం పంపేసరికి; నా రాకకి అసలు కారణాలు మాతృభక్తీ, పితృభక్తే అయినా అక్కడ మాత్రం దేశభక్తి అనే చెప్పేను. "నా అనుభవం, జ్ఞానం మా దేశానికి ఉపయోగపడాలని కోరుకుంటూ ఈ పదవీ, ఈ దేశం వదిలేస్తున్నాను'' అంటే అర్థం అదేకదా.

"ఫలానా ఫలానా అర్హతలు, అనుభవం కల నేను; ఈ దేశంలో స్థిరపడదామని వచ్చేసేను కనక; నా అర్హతలూ అనుభవం ఉపయోగించుకోగల సంస్థలు తాము నాకివ్వగల వెల, సదుపాయాలూ ఉదహరిస్తూ దరఖాస్తు చేసుకోవచ్చు'' అని భారతదేశం అంతటా అమ్మే పత్రికలో ప్రకటన వేస్తే; ఒక్కటంటే ఒక్కటి కూడా నాకు నచ్చే ఆఫర్ రాలేదు.

ఇహ ఇది కాదు పని అని, ప్రభుత్వసంస్థలు దిన పత్రికల్లో వేసే ప్రకటనలు చూసి నేనే దరఖాస్తులు పంపేను. వాటికి బదులుగా నన్ను ఇంటర్వ్యూలకి రమ్మని పిలుపులు వచ్చాయి. కాని అన్ని పిలుపుల్లోనూ కూడా; "మీరు అడిగిన విధంగా ప్రయాణపు ఖర్చులు ఇచ్చే సావకాశం లేదని గమనిక'' అని వుంది. విద్వత్తూ సామర్థ్యం ఉన్న వాళ్లని కూడా వీలైనంత తక్కువ ధరకి కొనేద్దామనుకునే ఈ దేశపు పెద్దల మనస్తత్వానికి చింతిస్తూనే ఒక ఇంటర్వ్యూకి స్వంత ఖర్చులకి సిద్ధమై వెళ్లాను.

తతంగం అంతా అయిపోయాక ఇంటర్వ్యూకి రావడానికి ఖర్చులు ఎందుకివ్వలేక పోతున్నారో వివరించవలసిందిగా మనలో మన మాటగా అడిగాను.

"మీరు ఒక కులానికి గాని, ఒక తెగకి కాని చెంది ఉంటే మీకు ఆ ఖర్చు లివ్వడానికి వీలుండేది. అంతేకాక ఈ ఇంటర్వ్యూలో మీరు జారిపోకుండా నిలదొక్కుకోడానికి సహాయ పడే శిక్షణ కూడా దొరికేది. మీరు చాలాకాలం అమెరికాలో ఉండిపోయారు కనుక మీకీ విషయాలు తెలియలేదు'' అన్నారు ఒకాయన.

"మీరు ఆ కులంలో, ఆ తెగలో పుట్టి ఉన్నట్లయితే ఇన్ని అర్హతలు లేకుండానే ఇంతకన్నా పెద్ద హోదాలోనూ, జీతం లోనూ మిమ్మల్ని నియమించే సావకాశం ఉంది'' అని ఇంకో ఆయన చెప్పేరు.

"ఈ రకం కేటాయింపులు పదేళ్లపాటు ఉంటాయని రాజ్యాంగం రాసినపుడు అన్నారు. ఆ పదేళ్లూ ఇంకా అవలేదా?'' అన్నాను.

"పదేళ్లు పదేళ్లు చొప్పున అలా పొడిగించుకుంటూ వస్తున్నాం. అంతెందుకు, మొన్న ఈ మధ్య ప్రభుత్వాలు పడిపోతాయని భయం పట్టుకోవడంతో ఒక్కసారిగా ముప్ఫయి లక్షల మందిని ఆ కులాల వారిని, ఈ తెగల వాళ్లనీ పిల్చి మరీ ఉద్యోగాల్లో చేర్చుకుని ఆ వోట్లన్నీ పైకి పోకుండా చూసుకోవడం అయింది. వయసు దాటిపోయినా ఫర్వాలేదు; అర్హతలు లేకపోయినా ఇబ్బంది లేదు; అర్హత ఉండీ మార్కులు నలభై శాతం తక్కువ వచ్చినా బాధలేదు. ఈ పద్ధతి ఇంకో పదేళ్లపాటు, మరో పదేళ్లపాటు కొనసాగుతుందని హామీ ఇవ్వడం కూడా అయిపోయింది.''

వాళ్లకో నమస్కారం పెట్టి, ఇంటికొచ్చి మా నాన్నగారి దగ్గర వాపోయాను. "ఏంటి నాన్నగారూ, ఈ దేశం నానాటికీ ఇలా తయారవుతోంది? నేనొచ్చేసే బదులు మీరే అక్కడికొచ్చేస్తే బాగుండేదేమో! ఈ దేశంలో ఉండాలంటే దేశభక్తి తప్ప వేరే కారణం ఏమీ కనబడ్డం లేదు!''

"ఏమో నాయనా. నీకీ ఉద్యోగం వస్తే తప్పకుండా చేరిపో. ఆ పైన దేవుడి దయ'' అన్నారు మా నాన్నగారు. ఆ మాటతో నాకన్ని సందేహాలు తీరిపోయాయి. అదే ఇంక మన దేశానికి తారకమంత్రం.

★

# 25. తలతిక్క కుదిరింది

**మా** ఆఫీసులో నాతో బాటు పనిచేసే భానుమూర్తికి "అలంకార పద్ధతిలో'' మాట్లాడ్డం సరదా. చాలాకాలం అతని మాటలు వింటూ ఇతనేమిటి, ఇలా తలతిక్కగా మాట్లాడతాడు అనుకునే వాళ్లం. కాని కొంత కాలానికి అతను "తలతిక్క పద్ధతిలో మాట్లాడ్డం'' అవతలి వాళ్లకి వెంటనే మాట తోచకుండా చెయ్యడానికేనని మాకు తెలిసింది. "నేనేం తలతిక్కగా మాట్లాడ్డం లేదు; నాకు స్క్రూలూజూ లేదు. కొన్నాళ్లు సరదాగా అలంకార శాస్త్రం చదివేను. అందులో వక్రరీతి అనే అలంకారం నాకు పట్టుబడినట్టుంది; అంతే'' అని వివరణ కూడా ఇచ్చేడు భానుమూర్తి.

ఓసారి మా సహోద్యాయి అప్పారావు ఇంటికి కొలీగ్స్ అంతా భోజనానికి వెళ్లవలసొచ్చింది.

ఆఫీసు పనిచేసే వేళలు ఉదయం పదిగంటల నుంచి సాయింకాలం అయిదు వరకూ అయితే మధ్యలో భోజన విరామసమయం ఒక అరగంట ఉంటుంది. ఆ ప్రకారం సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంట అయ్యేసరికి ఎవళ్లమట్టుకి వాళ్లు పని ఆపేసి కేరేజీలు విప్పుకొని భోజనాల వాళ్లు భోజనాలు, టిఫిన్లు వాళ్లు టిఫిన్లు తినడం; ఆ సందర్భంగా సినిమాల గురించి, టి.వి సీరియల్సు నుంచి వార పత్రికల సీరియల్స్ వరకు గల "సీ-రియల్స్'' గురించి, రాజకీయాల